క్లుప్తంగా

పరిపాలన సౌలభ్యానికే సచివాలయ వ్యవస్థ

ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు



విశ్వేశ్వరాయపురంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సౌలభ్యం కోసమే సచివాలయ వ్యవస్థను తెచ్చారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం విశ్వేశ్వరాయపురంలో రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు అందాలన్న సంకల్పంతో సచివాలయ వ్యవస్థను, రైతులకు అవసరమైన సహాయ, సహకారాలు పూర్తిగా అందుబాటులోకి తెచ్చేందుకు ఆర్‌బీకే సెంటర్లను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. సర్పంచ్ చెల్లుబోయిన హెలీనా, సీనియర్ నాయకుడు కేఎస్ఎన్ రాజు, ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, జెడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, ఎంపీటీసీ చెల్లుబోయిన గౌరి, పీఏసీఎస్ అధ్యక్షుడు చెల్లుబోయిన బుచ్చియ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు చెల్లుబోయిన సత్యనారాయణ, మండల ఏఏఎం చైర్మన్ నల్లి శివకుమార్, జిల్లా ఏఏఎం మెంబర్ గుబ్బల రమేష్, అధికారులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ టీచర్ పెయింటింగ్‌కు ప్రశంసలు



ప్రశంసలు అందుకున్న పెయింటింగ్ ఇదే..

మలికిపురం: ఇరుసుమండ స్కూల్ డ్రాయింగ్ టీచర్ వైవీఎస్ నారాయణ భారతీయ మహిళ అనే పేరుతో పెయింటింగ్ చేసిన చిత్రానికి ప్రశంసలు లభించాయి. ఈ వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. ఈ నెల పదో తేదీ నుంచి హైదరాబాద్ సాలార్‌జంగ్ మ్యూజియంలో క్రి యేటివిటీ ఆర్ట్స్ ఆధ్వర్యంలో మాస్టర్ స్ట్రోక్–3 పేరుతో 53 మంది చిత్రకారులతో కార్యక్రమం నిర్వహించారని చెప్పారు. తాను వేసిన పెయింట్ మ్యూజియానికి పంపినట్టు తెలిపారు. ఈ పెయింటింగ్‌ను మెచ్చి, అక్కడి ప్రముఖులు, అధికారులు తనను సత్కరించారని నారాయణ చెప్పారు.

ఉచిత వైద్య పరీక్షలు



మామిడికుదురులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రశాంత్

మామిడికుదురు: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా మామిడికుదురు–2 సచివాలయం పరిధిలో సోమవారం 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. బీసీ సామాజిక భవనంలో నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కేజీ ప్రశాంత్ ఆధ్వర్యంలో మధుమేహం, బీపీ, హెచ్‌బీ పరీక్షలు చేశారు. గర్భిణులు, బాలింతలను పరీక్షించి, ఉచితంగా మందులు అందించారు. గర్భిణులు, బాలింతలు తగిన ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, పౌష్టికాహా రం తీసుకోవాలని డాక్టర్ ప్రశాంత్ సూచించా రు. హెల్త్ సూపర్‌వైజర్ కె.శ్రీనివాస్, ఏఎన్ఎంలు కె.దుర్గాదేవి, ఎం.జయకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ రోషిణి దయానా, డీఈఓ సీహెచ్ ఎస్‌వీ సత్యనారాయణ, ఫైలట్ జీవన్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



అయినవిల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

అయినవిల్లి: మండలంలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర సోమవారం పరిశీలించారు. మడుపల్లి, చింతనలంక, వెలువలపల్లి, అయినవిల్లిలోని పోలింగ్ కేంద్రాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల పరిధిలోని పరిస్థితులపై ఆరా తీశారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ పి.అశోక్‌ప్రసాద్, వీఆర్వోలు ఉన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

ఆత్రేయపురం: పులిదిండి గ్రామం గోదావరి పరివాహక ప్రాంతంలోని ఇసుక ర్యాంపు ర్యాంపు వద్ద 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్సై ఎస్.శ్రీనివాస్ తెలిపారు. నాటు సారా రవాణా జరుగుతున్నట్టు తమకు అందిన సమాచారంతో, జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు డీఎస్పీ కేవీ రమణ పర్యవేక్షణలో సీఐ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పులిదిండి గ్రామంలో తమ సిబ్బందితో దాడులు చేశామన్నారు. బెల్లపు ఊట లభ్యం కావడంతో ధ్వంసం చేసినట్టు తెలిపారు.

ఆసరాతో మహిళల కళ్లలో ఆనందం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- ఈతకోటలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా అందజేత
- సభకు భారీగా తరలివచ్చిన మహిళా లోకం



వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



ఉచ్చిలిలో హైస్కూల్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: డ్వాక్రా మహిళలకు నాలుగు విడతలుగా రుణమాఫీ చేసి, ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఈతకోట గ్రామంలో ఆసరా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని గోపాలపురం, ముమ్మిడివరప్పాడు, దేవరపల్లి, ఈతకోట, కేతరాజుపల్లి, పొడగట్లపల్లి గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలకు మంజూరైన నాలుగో విడత రుణమాఫీని నమూనా చెక్కు రూపంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గంలోని ఆలమూరు మండలంలో రూ 60.08 కోట్లు, ఆత్రేయపురం మండలంలో రూ.41.02 కోట్లు, కొత్తపేట మండలంలో రూ.63.34 కోట్లు, రావులపాలెం మండలంలో రూ.54.86 కోట్లు, మొత్తంగా కొత్తపేట నియోజకవర్గంలో రూ.219.60 కోట్ల లబ్ధిని వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా అందించామని వివరించారు. వైఎస్సార్ ఆసరాతో మహిళల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందన్నారు. ఈ సందర్భంగా సభకు హాజరైన ఆడపడచులకు లక్కీడిప్ ద్వారా బహుమతులను అందజేశారు. అలాగే అందరికీ విందు ఏర్పాటు చేసి, స్వయంగా జగ్గిరెడ్డి వడ్డించారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి, జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అప్పారి విజయకుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, వత్సవాయి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

నేను సంపాదించుకున్న ఆస్తి మీరే..

ఆత్రేయపురం: జీవితంలో తాను సంపాదించుకున్న, తన తండ్రి ఇచ్చిన అత్యంత విలువైన ఆస్తి కొత్తపేట నియోజకవర్గ ప్రజలేనని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆయన సోమవారం మండలంలోని ఉచ్చిలి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్ ఉ‌గ్రింకల త్రిమూర్తులు, బి.శివ, ఇందుకూరి కృష్ణంరాజు, పద్దరాజు, మాజీ ఎంపీటీసీ ఉగ్రింకల శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో రూ.1.36 కోట్లతో నిర్మించిన హైస్కూల్, రూ.17 లక్షలతో నిర్మించిన ప్రైమరీ స్కూల్ భవనాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యం కల్పిస్తోందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ప్రతిపక్షాలకు కనబడడం లేదా అంటూ సూటిగా ప్రశ్నించారు. రాజకీయాలకతీతంగా లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా లబ్ధిని జమ చేసిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీయేనన్నారు. ఎవరెన్ని చెప్పినా, ఏ ప్రభుత్వంలో ఎంత లబ్ధి పొందారో ప్రజలకు తెలుసని చెప్పారు. ప్రతిసారీ బటన్ నొక్కి వారి ఖాతాలకు సంక్షేమ పథకాల సొమ్మును అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞులైన ప్రజలు సమయం వచ్చినప్పుడు ఒక్కసారి బటన్ నొక్కి కృతజ్ఞతలు తెలుపుతారన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం వైఎస్సార్ సీపీ అభిమానులైన కారణంగా, అర్హులైన వృద్ధులు, వికలాంగులకు సైతం పెన్షన్లు రాకుండా అప్పటి జన్మభూమి కమిటీలు అడ్డుకున్నాయన్నారు.

ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎలాంటి రికమండేషన్లు లేకుండా, అర్హతే ప్రామాణికంగా అన్ని పథకాలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ కప్పల శ్రీధర్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పెన్మెత్స బంగ్రరాజు, సర్పంచ్‌లు పాలా నాగేశ్వరరావు, గాదిరాజు రామకృష్ణంరాజు, వివిధ శాఖల అధికారుల, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

వైభవంగా నీలకంఠేశ్వర స్వామి కల్యాణం



అంతర్వేది శివాలయంలో స్వామివారి కల్యాణం చేస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేదిలో పార్వతీ సమేత నీలకంఠేశ్వర స్వామివారి కల్యాణాన్ని సోమవారం ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. పెనికేరుకు చెందిన శైవాగమ పండితుడు పుల్లేటికుర్తి సాంబశివరావు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఈ కల్యాణం కనుల పండువగా జరిగింది. తొలుత నంది వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. అనంతరం ఆలయంలో నిర్వహించిన స్వామి కల్యాణోత్సవంలో మోరికి చెందిన దాత చింతా నరసింహరావు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అంతర్వేది దేవస్థానం ఏసీ వి.సత్యనారాయణ స్వామివారిని కల్యాణం ఘట్టంలో దర్శించుకుని పూజలు చేశారు.

రూ.1.20 కోట్లతో రహదారుల అభివృద్ధి



మాకనపాలెంలో రోడ్డు ఆధునీకరణకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

మామిడికుదురు: రహదారులను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కుసుమ వనజ కుమారి తెలిపారు. మాకనపాలెం గ్రామంలో రూ.1.20 కోట్లతో చేపట్టనున్న రోడ్ల అభివృద్ధి పనులకు సోమవారం వారు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాకనపాలెం వంతెన నుంచి ఆదుర్రు ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు రెండు కి.మీ. మేర మెయిన్ రోడ్డును బీటీ రహదారిగా అభివృద్ధి చేసేందుకు పీఆర్ఆర్ ప్లెయిన్ నిధుల నుంచి రూ.1.05 కోట్లు మంజూరైందన్నారు. ప్రధాన ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణానికి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సీఎస్ఆర్ ద్వారా రూ.12 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. గ్రామంలో గ్రావెల్ రోడ్డు అభివృద్ధికి రూ.3 లక్షలు మంజూరయ్యాయన్నారు. రోడ్ల అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తారన్నారు. సర్పంచ్ మద్దాల బాబూరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వలవల పెదబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చెల్లింగి రామకృష్ణ, మాజీ సర్పంచ్ నేల ప్రభుదాసు, పార్టీ నేతలు భూపతి దామోదరరావు, కాండ్రేగుల శ్రీనివాస్, మద్దాల ప్రభాకర్, పీఆర్ ఏఈ చిన్నంరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సహకరించండి



నాగుల్లంకలో జెడ్పీ చైర్మన్ విప్పర్తిని అభినందిస్తున్న పార్టీ శ్రేణులు

పి.గన్నవరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి సహకరించాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు కోరారు. మండలంలోని మొండెపులంక, నాగుల్లంక గ్రామాల్లో సోమవారం ఆయన పార్టీ శ్రేణులు, గ్రామ పెద్దలతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతు కోరాలని సూచించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జగన్ పాలనలో రాష్ట్రాభివృద్ధి జరిగిందని పెద్దలకు వివరించారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేందుకు సహకరించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఆలమూరు: రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో ఆలమూరుకు చెందిన విద్యార్థులు చక్కని ప్రతిభను కనబర్చి పతకాలు సాధించారు. అమలాపురంలోని సాధికాస్ ఫౌండేషన్ హాలులో ఇటీవల రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో వైట్ బెల్ట్ ఏ–విభాగంలో గెద్దాడ జ్యాయ్ కిరణ్ (బంగారు) బి–విభాగంలో ఆర్.నాగవెంకట అఖిల్ (వెండి) పతకాలు సాధించినట్టు కోచ్ టి.వెంకటలక్ష్మి సోమవారం విలేకరులకు తెలిపారు. అలాగే జూనియర్ విభాగంలో కట్టా అనుశ్రీ కార్తీక్, గ్రీన్ బెల్ట్ ఏ–విభాగంలో జి.వీరబాబు బంగారు పతకాలు సాధించారు. వీరు స్థానిక శ్రీసిద్ధార్థ హైస్కూల్‌లో చదువుతున్నారు.

ఆనందోత్సాహాలతో బీబీ జైనబ్ జయంతి



మామిడికుదురు పంజాలో మిలాద్‌లో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్యులైన హజరత్ అలీ తనయురాలు బీబీ జైనబ్ జయంతిని సోమవారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. మామిడికుదురు అలందార్ అబ్బాస్ పంజాతో పాటు, నగరంలోని మంజిలే కర్బలాలో మిలాద్ జరిగింది. మొహ్మద్ ఖాసిం రజా రజ్వీ ఆధ్వర్యంలో జరిగిన మిలాద్‌లో సుదూర ప్రాంతాల నుంచి ముస్లిం భక్తులు పాల్గొన్నారు. బీబీ జైనబ్ జీవిత చరిత్రలోని ముఖ్య ఘట్టాలను, మహిమలను భక్తులకు వివరించారు. మత ప్రబోధకుడు సయ్యద్ అబ్బాస్ బాకరీ పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థుల అదృశ్యం

అల్లవరం: మండలంలోని గోడి బాలుర గురుకులంలో తొమ్మిదో తరగతి చదువుతున్న కొమరగిరిపట్నానికి చెందిన మెల్లం నాగేంద్రబాబు, కాట్రేనికోన మండలం భట్టుచెరువు ప్రాంతానికి చెందిన గుర్రాల టోనీబాబు సోమవారం ఉదయం 6 గంటల సమయంలో అదృశ్యమయ్యారని ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపారు. గురుకులం పరిసర ప్రాంతాలు, విద్యార్థుల స్వస్థలాల్లో గాలించినా ఆచూకీ దొరకలేదన్నారు. ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. గురుకులం విద్యార్థుల ఆచూకీ తెలిసిన వారు అల్లవరం పోలీస్‌స్టేషన్ ల్యాండ్ నెంబర్ 08856 253433, ఎస్ఐ హరీష్‌కుమార్ 94907 60764, రూరల్ సీఐ వీరబాబు 94407 96526 సెల్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇదే గురుకులంలో సెకండ్ ఇంటర్ చదువుతున్న విద్యార్థి జనవరి 31న అదృశ్యమైన విషయం విదితమే. సదరు విద్యార్థిని ఫిబ్రవరి 1న అంబాజీపేట బస్‌స్టేషన్లో పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. పది రోజుల వ్యవధిలో ముగ్గురు విద్యార్థుల అదృశ్యంపై సర్వత్రా ఆందోళన నెలకొంది.

మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం కృషి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు
- డ్వాక్రా మహిళలకు రూ.11.81 కోట్ల వైఎస్సార్ ఆసరా పంపిణీ



పోతవరంలో డ్వాక్రా మహిళలకు చెక్కును అందజేస్తున్న విప్పర్తి వేణుగోపాలరావు

పి.గన్నవరం: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా నాలుగో విడత రుణ మాఫీ పంపిణీ కార్యక్రమం పోతవరం లేఅవుట్‌లో సోమవారం జరిగింది. మండలంలో మొత్తం 1,515 డ్వాక్రా గ్రూపులకు రూ.11.81 కోట్ల రుణ మాఫీ చెక్కును విప్పర్తి అందజేశారు. ఏపీఎం మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని డ్వాక్రా మహిళలకు నాలుగు విడతలుగా మొత్తం రూ.47.25 కోట్ల మేర సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రుణమాఫీ చేశారని వివరించారు. మహిళా సంక్షేమం కోసం పాటుపడుతున్న ఆయనను మళ్లీ సీఎంగా గెలిపించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, తనను అసెంబ్లీకి పంపాలని విప్పర్తి విజ్ఞప్తి చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. మండల మహిళా సమాఖ్య సభ్యులు విప్పర్తిని దుశ్శాలువాతో సత్కరించారు. ఎంపీడీఓ త్రిశూలపాణి, నగరం ఏఎంసీ చైర్ పర్సన్ నక్కా కృష్ణవేణి, కార్పొరేషన్ డైరెక్టర్ మద్దుల వరలక్ష్మి, మండలశాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి వెంకట శివరామన్, పితాని నర్సింహరావు, సర్పంచ్‌లు తోలేటి బంగారు నాయుడు, వడలి కొండయ్య, కొంబత్తుల ఏసుబాబు, బండి మహలక్ష్మి, కుసుమ చంద్రకళ, దొమ్మేటి పార్వతి, దంగేటి అన్నవరం, యల్లమెల్లి కృష్ణవేణి, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి భారీగా హాజరైన డ్వాక్రా మహిళలు

పీఏసీఎస్ చైర్మన్‌గా పుల్లారావు ప్రమాణ స్వీకారం



మోదుకూరులో చైర్మన్ పుల్లారావును గజమాలతో సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

ఆలమూరు: మండలంలోని మోదుకూరు పీఏసీఎస్ చైర్మన్‌గా ముత్యాల పుల్లారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ డీసీసీబీ నుంచి విచ్చేసిన ప్రత్యేక ప్రతినిధి ఈ మేరకు పుల్లారావు, సభ్యులు నూలు సత్యనారాయణ, తాతపూడి రాంబాబుతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెంటపాటి శ్యామల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నేతలు మేడపాటి శ్రీనివాసరెడ్డి, తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. రైతుల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని చైర్మన్ పుల్లారావు హామీ ఇచ్చారు. రైతులకు ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందేలా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డికి, చైర్మన్ ముత్యాలరావుకు కృతజ్ఞతలు తెలిపారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ నల్లి రాజు, పెంటపాటి వెంకట్రావు, జడ్డు సతీష్, ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు.

రీచ్‌లను పరిశీలించిన కలెక్టర్

ఆత్రేయపురం: మండలంలోని అంకంపాలెం, వద్దిపర్రు గ్రామాల్లో ఉన్న ఇసుక రీచ్‌లను సోమవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలించారు. రీచ్‌ల వద్ద ఇసుక తవ్వకాలు జరిపేందుకు అనువుగా ఉన్నాయా, లేవా అని వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట హెడ్‌వర్క్స్, మైన్స్ అధికారులు ఉన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేస్తున్న రమేష్‌బాబు

రావులపాలెం: మండలంలోని దేవరపల్లి బాలయోగిపేటలో ఉన్న జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు సోమవారం ఎగ్జామినేషన్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. హెచ్‌ఎం భమిడిపాటి వీఎస్ఎస్ సాయిరాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కొత్తపేట సబ్ జైల్‌లో హెడ్ వార్డర్ డి.రమేష్‌బాబు సమకూర్చిన ఎగ్జామినేషన్ మెటీరియల్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీఎంసీ చైర్మన్ బి.ప్రసాద్ మాట్లాడుతూ ఈ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఉచిత వైద్య శిబిరం



రాజోలు బస్టాండ్‌లో చంటి పిల్లలకు పాలు పట్టే గదిని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీకాంత్



విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తున్న రవాణా శాఖాధికారులు

రాజోలు: భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రాజోలు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని డిపో మేనేజర్ పి.భాస్కరరావు సోమవారం ప్రారంభించారు. మెడ్ యునైటెడ్ ఆస్పత్రి డాక్టర్ బి.ఉదయ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 80 మంది ఉద్యోగులకు వివిధ పరీక్షలు చేశారు. అలాగే సురక్ష ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన బిడ్డకు తల్లిపాలు పట్టే ప్రత్యేక గదిని డాక్టర్ సీహెచ్ శ్రీకాంత్ ప్రారంభించారు. ప్రయాణంలో చిన్నపిల్లలకు తల్లిపాలు ఇచ్చేందుకు ఇబ్బందులు లేకుండా ఈ గదిని వినియోగించుకోవచ్చని చెప్పారు.

రహదారి భద్రతపై అవగాహన సదస్సు

రాజోలు: రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంవీఐలు నాగేంద్ర, ఓలేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తాటిపాకలోని వేద డిగ్రీ కళాశాల విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.



రక్తదానం చేస్తున్న టోల్‌ప్లాజా మేనేజర్ రెడ్డి తదితరులు

ఈతకోటలో రక్తదాన శిబిరం

రావులపాలెం: ప్రతిఒక్కరూ రక్తదానం చేయడంతో ఇతరుల ప్రాణాలను కాపాడవచ్చని నేషనల్ హైవే ఈతకోట టోల్ ప్లాజా మేనేజర్ కేవీవీఎస్ఎన్ రెడ్డి అన్నారు. సోమవారం 35వ జాతీయ రహదారుల రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా టోల్ ప్లాజా వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. కాకినాడ రోటరీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ శిబిరం కొనసాగింది. సుమారు 50 మంది రక్తదానం చేశారు. టోల్‌ప్లాజా, హైవే సేఫ్టీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

మామిడికుదురు: మండలంలోని మూడు గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ సోమవారం తెలిపారు. జాతీయ రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా అడ్డుగా ఉన్న కొబ్బరి చెట్లను తొలగించాల్సి ఉందన్నారు. మండలంలోని పాశర్లపూడిబాడవ, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

రెండు తాటాకిళ్లు దగ్ధం

పి.గన్నవరం: షార్ట్‌సర్క్యూట్ కారణంగా పోతవరం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. పెద్దిమేను మంగాయమ్మకు చెందిన ఇంట్లో మంటలు చెలరేగి, పక్కనే ఉన్న శ్రీనివాసరావు ఇంటికి వ్యాపించాయి. ఇళ్లలోని సామాన్లు, ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు, నగదు, బంగారు నగలు అగ్నికి ఆహుతయ్యాయి. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. బాధిత కుటుంబాలకు రెవెన్యూ అధికారులు బియ్యం పంపిణీ చేశారు. జనసేన నాయకుడు గిడ్డి సత్యనారాయణ ఆయా కుటుంబాలకు రూ.పది వేల వంతున ఆర్థిక సాయం, బియ్యం అందించారు.

మద్యం విక్రేత అరెస్టు

అంబాజీపేట: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామని అంబాజీపేట ఎస్సై కె.చిరంజీవి సోమవారం తెలిపారు. అంబాజీపేట మండలం చిరతపూడికి చిట్టిచెరువుకు చెందిన చిట్టూరి వెంకటరమణ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం అందిందన్నారు. దాడి చేసి అతని వద్ద నుంచి రూ.5,920 విలువైన 42 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అతడిని అరెస్టు చేసి, కోర్టులో హాజరు పర్చామన్నారు.